www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 11 ఆగస్టు 2023

5

వైఎస్ఆర్

27న ముస్లిం ఐక్యవేదిక సమావేశం

మాట్లాడుతున్న సలావుద్దీన్

కడప అర్బన్: ముస్లిం సమాజాన్ని చైతన్య వంతునలు చేయడమే లక్ష్యంగా ఈనెల 27న గుంటూరులో నిర్వహించే సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ముస్లిం ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ముస్లిం ఐక్యవేదిక పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్ని విధాల వెనుకబడిన ముస్లిం సమాజ అభివృద్ధికి తగిన చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. సంఘ సేవకులు సలావుద్దీన్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన ముస్లిం సమాజాన్ని ఒకతాటిపైకితెచ్చి సమస్యలపై చర్చించేందుకు గుంటూరులో సమావేశ నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ముస్లిం ఐక్య వేదిక నాయకులు అబ్దుల్ కలాం, అబ్దుల్ అజీజ్, సయ్యద్ ఖలీల్, జమీర్ పాల్గొన్నారు.

కడపలో భారీ వర్షం.. రహదారులు జలమయం

చెరువులు తలపించేలా రహదారులు

ఆర్‌టిసి బస్టాండ్‌లోకి చేరిన వర్షపు నీరు

ఇబ్బందులుపడ్డ ప్రజలు, వాహనదారులు

ప్రజాశక్తి-కడప సిటీ/చాపాడు

కడపలో భారీ వర్షం కురిసింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని రోడ్లన్నీ చెరువులను తలపించాయి. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. ఆర్‌టిసి బస్టాండ్ రోడ్డు, అంబేద్కర్ కూడలి, కోర్టు రోడ్డు, భరత్‌నగర్, చెన్నయ్ రోడ్డు, మృత్యుంజయకుంట, గంజికుంట కాలనీ, అక్కాయపల్లె, ప్రకాష్‌నగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరద నీరు చేరింది. వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై మోకాల్లోతు వరకు వర్షపునీటితో వాహనాలు మొరాయించాయి. కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పలు లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అక్కాయపల్లెలోని పాత గోడ కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు నగర పాలక అధికారులు యుద్ధప్రాతిపధిక చర్యలు చేపట్టారు.

కడప ఆర్‌టిసి బస్టాండ్‌లోకి చేరిన వరద నీరు

మైదుకూరులో రోడ్లన్నీ జలమయం

మైదుకూరులో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేని వర్షంతో రోడ్లన్ని జలమయమైయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్ల పైన నీరు పొంగి ప్రవహించింది. నంద్యాల రోడ్డు, కడప రోడ్డులో భారీగా నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో ఎక్కడ చూసిన నీరు అధికంగా కనిపించినది. మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకుని డ్రెయినేజీ వ్యవస్థను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే వర్షం వచ్చిన ప్రతిసారీ ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణంలో వర్షంతో రోడ్లపై నిలిచిన నీటితో ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర నీటి తోలగింపుకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. నంద్యాల రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థను దగ్గరుండి మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులతో వర్షంలోనే పూడికతీత పనులు చేయించారు. రోడ్లపై నిలిచిన నీరు తోలగిపోయినది. డ్రెయినేజీ సంబంధించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులను తలపించేలా రహదారులు

జలమయమైన రహదారులు

మైదుకూరు నంద్యాల రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఖరీఫ్ కథ కంచికే!

37,940 ఎకరాల్లోనే విత్తనం
జిల్లాలో 20.8 శాతమే సాగు
కొనసాగుతున్న లోటు వర్షపాతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ కథ కంచికి చేరుతోంది. గతేడాది ఇదేసమయానికి 32.29 శాతం సాగైంది. గతేడాదిదో పోలిస్తే ప్రస్తుత 20.8 సాగు శాతాన్ని పరిశీలిస్తే వెనుకబాటుతనం కొనసాగుతోంది. ఇదేతరహా పరిస్థితి కొనసాగితే 40 నుంచి 45 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తుండడం గమనార్హం. పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా పంటల సాగు పడిపోవడం ఆందో ళనకలిగిస్తోంది. వర్షాభావమే ప్రధాన కారణమని చెబుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది.

ఖరీఫ్-2023లో1,88,978 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలనేది జిల్లా వ్యవసాయశాఖ లక్ష్యం. జూన్ నుంచి నేటి వరకు 73 రోజుల్లో 191.6 వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ 118 మి.మీ మాత్రమే నమోదు కావడం ఖరీఫ్ సాగును ప్రశ్నార్థకంగా మార్చింది. ఈలెక్కన 38.4 శాతం లోటు వర్షపాతం కొనసాగుతుండడం ఆందోళన కలిగి స్తోంది. జిల్లాలోని 1,88,978 ఎకరాల విస్తీర్ణంలో 37,940 ఎకరాల్లో మాత్రమే విత్తన పడడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. మిగిలిన 1,51,030 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆగస్టు ఐదవ తేదీ నాటికి 81,376 ఎకరాల్లో వరి విస్తీర్ణంలో 9,355 ఎకరాల్లో మాత్రమే వరి నాటు పడింది. గతేడాది ఇదేసమయానికి 15,662 ఎకరాల్లోనే నాటు పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెల 20 నుంచి కెసి కెనాల్‌కు సాగునీటిని విడుదల చేయనుండడంతో వరి పంట సాగు పట్ల వ్యవసాయ శాఖ ఆశలు పెట్టుకుంది. వరి సాగు విస్తీర్ణం పెంపు ఆధారంగా అంచనాలు వేసుకుంటోంది.

అన్నింటా అథమమే!

జిల్లాలోని ఏడు ప్రధాన ఆహా రపు పంటల్లో వరి సాగు తదుపరి వేరుశనగ సాగు పరిస్థితిని గమనిస్తే ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 14,063 ఎకరాల విస్తీర్ణంలో 4,135 ఎకరాల్లో మాత్ర మే విత్తనం పడిం ది. ఈలెక్కన పంటల సాగు తేడాను గమనిస్తే 10 వేల ఎకరాల్లో వేరు శనగ విత్తనం పడాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. పత్తి సాగును పరిశీలిస్తే 52,839 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా 12,524 ఎకరాల్లోనే విత్తనం పడినట్లు తెలుస్తోంది. గతేడాది ఇదేసమయానికి 30 వేల ఎకరాల్లో విత్తనం పడినట్లు తెలుస్తోంది. మోస్తరు స్థాయిలో విత్తిన పంటల వివరాలను పరిశీలిస్తే మొక్కజొన్న 1908 ఎకరాలు, మినుములు 3219 ఎకరాలు, కంది 1903 ఎకరాలు, 933 ఎకరాల్లో సోయాబీన్, పొద్దుతిరుగుడు 475 ఎకరాలు, పసుపు 279 ఎకరాలు, ఉల్లి 747 ఎకరాల్లో విత్తనం పడింది. గతేడాది ఉల్లి 3,762 ఎకరాల్లో విత్తనం పడినట్లు తెలుస్తోంది.

కొనసాగుతున్న వర్షాభావం

జిల్లాలో మినుమ మినహా వరి దగ్గర నుంచి అన్ని పంటల సాగును పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. సాగు విసీర్ణం తగ్గుదల కారణాల్లో వర్షపాతాన్ని పరిశీలిస్తే 38.4 శాతంగా ఉంది. జూన్‌లో 69.2 మి.మీగానూ 38.7 మి.మీ శాతం, జులైలో 96.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 77.4 మి.మీ మాత్రమే నమోదైంది. ఆగస్టులో 114.0 మి.మీ వర్షపాతం నమోదులో నేటికి 26.7 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 1.9 మి.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా 403.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, నేటికి సాధారణ వర్షపాతం కింద 191.6 మి.మీ మాత్రమే నమోదు కావడం గమనార్హం.

60 శాతం విస్తీర్ణంలో పంటలు లేనట్లే!

2023-24 ఖరీప్ సీజన్ 2010 నుంచి సుమారు పదేళ్లకుపైగా ఎన్నడూ లేని విధంగా తీవ్ర వర్షాభావ పరి స్థితులు కొనసాగుతున్న నేప థ్యంలో సుమారు 60 శాతం విస్తీర్ణంలో విత్తనం పడే అవకాశాలు రోజురోజుకూ కుదించుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిఏటా ఆగష్టు 16న కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేయడం తెలిసిందే. ఈ ఏడాది ఆగష్టు 20న నీటిని విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. కెసి కెనాల్ పరిసర ప్రాంతాల్లోని 91 వేల ఎకరాల్లో పంటలు సాగుకు నోచు కునే అవకాశం ఉంది. 80 వేల ఎకరాల వరకు వరి పంట సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన మిగిలిన 11 వేల ఎకరాల్లో ఇతర పంటల సాగు ఊపందుకునే అవకాశాలు ఉన్నట్లు తెలు స్తోంది. ఏదేమైనా ఈ ఏడాది ఖరీఫ్ ఆశలు గల్లంతయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయనే సంకేతాలు అందుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

జడ్‌హెచ్‌డిసి భూములకు పట్టాలివ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మండలంలోని టి.చల్లగిరిగెల గ్రామంలోని జడ్‌హెచ్‌డిసి భూములకు అసైన్‌మెంట్ కమిటీలో పెట్టి పేద దళితులకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, ఉపాధ్యక్షులు వీరయ్య అన్నారు. గురువారం ఉదయం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గ్రామ దళితులకు 2005లో ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున భూములు ఇచ్చారని, పట్టాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నారు. వారికి తక్షణం పట్టాలు ఇచ్చి ఆన్‌లైన్ చేయాలని, రైతు భరోసా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ భూములకు ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం లబ్ధిదారులు పన్ను కడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రైతు భరోసా, పంటల బీమా సౌకర్యం, తదితర సదుపాయాలు కల్పించలేదన్నారు. సబ్ డివిజన్ చేసి హద్దులు చూపించాలన్నారు. ఉచితంగా ప్రతి లబ్ధిదారునికి బోర్లు కరెంటు సౌకర్యం కల్పించాలని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారుకు వినతి పత్రం సమర్పించారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అన్వేష్

కార్యక్రమంలో టి.చల్లగిరిగెల జడ్‌హెచ్‌డిసి భూముల లబ్ధిదారులు బాలయ్య, సుందరయ్య, రామయ్య, ఓబయ్య, కీర్తన, కళ్యాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు నారాయణ

మణిపూర్‌లో హింసను అరికట్టలేకపోవడం దారుణం

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి కడప అర్బన్

మణిపూర్‌లో హింసను అరికట్టకపోవడం దారుణమని పలువురు వక్తలు అన్నారు. గురువారం మణిపూర్‌లో హింసను నిరసిస్తూ ప్రెస్ క్లబ్‌లో వల్లూరు మాజీ సర్పంచ్ కిషోర్ కుమార్ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణ, బండి జకరయ్య, సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ, దళిత నాయకులు సీఆర్వీ ప్రసాదరావు, బిసి నాయకులు అవ్వారు మల్లికార్జున, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్టంలో నెలల తరబడి దమనకాండ జరుగుతున్నా నియంత్రించలేకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంఘటనలు చూసి మానవ జన్మ ఎందుకు అనిపిస్తుందన్నారు. అణగారిన వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, అస్తుల ధ్వంసం బాధకరమని తెలిపారు. 5వ తరగతి చదువుతున్న బాలికను కన్న తల్లి ఎదుటే అత్యాచారం చెయ్యడం మానవ జాతికే మాయని మచ్చ అన్నారు. పేదల ఇళ్లు, అస్తులను అనేకం ధ్వంసం చేసి అర్థికంగా నష్టం కలిగించారని పేర్కొన్నారు. అనేక సంస్కృతులు కలగలిసిన దేశంలో ఇలాంటి దారుణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్న జాతులు కలిగిన దేశంలో అమిత్ షా రాజ్యాంగం అమలవుతుందని తెలిపారు. ప్రపంచాన్ని శాసించే ప్రధాని ఒక చిన్న రాష్టంలో జరుగుతున్న ఇలాంటి దారుణాలను కట్టడి చేయలేకపోయారా అని ప్రశ్నించారు. ప్రపంచ దేశాలన్ని భారతదేశం అంటే అసృహించుకునే విధంగా ప్రస్తుత పాలన సాగుతుందని విమర్శించారు. ప్రజల్లో బిజేపి పాలనపై తిరుగుబాటు మొదలైందని చెప్పారు. ఎన్డీఏ పాలనకు వ్యతిరేకంగా పోరాటమే లక్ష్యమన్నారు.

విద్యా రంగాన్ని కాపాడుకుందాం : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

యుటిఎఫ్ 49 వసంతాలు పూర్తిచేసుకుని 50వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా యుటిఎఫ్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యారంగా, ఉపాధ్యాయ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నదని చెప్పారు. సంఘం ఆవిర్భావం నుంచి ఎందరో నాయకులు ఎన్నో పోరాటాలు చేసి ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. అలాంటి అంకితభావం కలిగిన నాయకులు నిర్మించిన యుటిఎఫ్ ఎప్పటికీ నిరంకుశ ప్రభు త్వాలతో రాజీలేని పోరాటాలు చేస్తూనే ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక విద్యా రంగం కుదేలై కూకటి వేళ్ళతో పెకలించబడి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇటువంటి తరుణంలో ఉపాధ్యాయులంతా మరింత చైతన్యవంతులై ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడుకోవడంలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సంఘం ఆవిర్భావం నాటి నాయకుల పోరాట పటిమ, అకుంఠిత దీక్ష ఈనాటి ఉపాధ్యాయుల్లో కూడా అలవర్చుకుంటే ప్రభుత్వ విద్యా రంగం, బడుగు బలహీన వర్గాలకు దూరం కాకుండా ఉంటుందని లేని పక్షంలో భవిష్యత్తులో విద్యారంగం మొత్తం ప్రైవేటుపరం అయ్యే ప్రమాదం పొంచుకుని ఉందని హెచ్చరించారు. పాఠశాలల విలీనం పేరుతో జీవో నంబర్ 117 ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి మూతపడే దిశగా ముందుకు వెళుతున్నదని తెలిపారు. జీవో నంబర్ 117 రద్దు చేయాలని ఈ నెల 12న ఫ్యాప్టో కలెక్టరేట్ వద్ద 12 గంటల నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, ట్రెజరర్ నరసిం హారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ల సమావేశం

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ల సమావేశం శుక్రవారం చెన్నూరులో జరుగుతుందని నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ విష్ణుప్రీతంరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఆరు మండలాలకు సంబంధించిన పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ సమావేశానికి నియోజవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించండి

- ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించి సంస్థపై వారికి సంతృప్తి స్థాయి పెంచే విధంగా పనిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ ఆదేశించారు. గురువారం ఆయన కడపలోని వినియోగదారుల సేవా కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు వారితో మమేకమై సభ్యతతో వారి సమస్యలను పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తిరస్థాయని పెంచే విధంగా పనిచేయాలని హెచ్చరించారు. ప్రజలు కొత్త సర్వీసుల విడుదల మరియు ఇతర సేవల కొరకు నమోదు చేసుకున్న తర్వాత సంస్థ నిర్దటశించబడిన కాల వ్యవధిలో పనులు చేసే విధంగా అధికారులకు ఫోన్ చేసి అనుసరించాలని తెలియజేశారు. ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలని హెచ్చరించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ గారు స్వయంగా వినియోగదారులకు ఫోన్ చేసి సంస్థ ద్వారా అందించిన సేవలు గురించి తెలుసుకున్నారు. సకాలంలో విద్యుత్ సేవలు అందించని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వినియోగదారులను సేవా కేంద్రం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఇ రమణ

ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా ఇంటింటి సర్వేని వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. గురువారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎక్స్ అఫిషియో కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్, వి.విజయ్ రామరాజు తోపాటు జెసి గణేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఇఒ ముఖేష్ మీనా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిపై జిల్లాల వారీగా కాలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024వ సంవత్సరం జనవరి 5న తుది ఓటర్ల ఎన్నికల సంక్షిప్త సవరణ జాబితాను సిద్ధం చేయాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 21వ తేదీ లోపు ఇంటింటి సర్వేని పూర్తి చేయాలన్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని.. రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. బిఎల్ఒ యాప్ ప్రకారం జిల్లాలో ఒరతి ఇల్లూ తిరిగి డుప్లికెట్ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వలస పోయిన వారు, మరణించిన వారు, కొత్తగా వివాహం అయ్యి వేరే ఊళ్లకు వెళ్లిన వారు, పునరావృతం అయిన పేర్లు వంటి తొలగింపుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఫారమ్ 6 ఫారమ్-7, ఫారమ్-8 పెండిన్సి ల పై, గ్రీవెన్స్ ల పరిష్కారాల గురించి వివరించారు. కొత్తగా ఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18-19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్ జెండర్లు, నిరాశ్రయుల జాబితాను తయారీలోను ప్రత్యేక ద ృష్టి సారించాలని సంబందిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిఆర్వో గంగాధర గౌడ్, సంబందిత శాఖకు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల

విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి-కాశినాయన

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులపై తల్లిదండ్రుల పరివేక్షణ ఎంతో అవసరమని ఎంఇఒ ఒ.నిర్మల తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎపి మోడల్ పాఠశాలలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చదువు విషయంలో సగం బాధ్యులైతే ఇంటి దగ్గర తల్లిదండ్రులు కూడా సగం బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు ఉపాధ్యాయులు పాఠశాలలో వర్గాలు విభేదాలు కుల మతాలు రాజకీయాలు పక్కనపెట్టి మన బిడ్డల్లాగా భావించుకొని వారికి విద్య చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ విషయం ఏ ఉపాధ్యాయులు కూడా మర్చిపోవద్దన్నారు. ప్రిన్సిపల్ సౌజన్య మాట్లాడుతూ మీ పిల్లలను పండుగలు ఫంక్షన్లు అని పాఠశాలకు పంపడం మానేయవద్దని, పాఠశాలకు గైర్హాజరైతే పిల్లలు చాలా నష్టపోతారన్నారు. పాఠశాలలో అర్థం కాని విషయం ఏదైనా ఉంటే మీ పిల్లలను ఆ పాఠశాల ఉపాధ్యాయులను కచ్చితంగా అడిగి తెలుసుకోమని చెప్పండన్నారు. పిల్లలు ఇంటికి వచ్చినాక కచ్చితంగా చదివించే బాధ్యత తల్లిదండ్రుల పైన ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా కష్టపడి చదివితే ఎంతో గొప్పవారు అవుతారన్నారు. తల్లిదండ్రుల సమావేశానికి తప్పక ప్రతి ఒక్కరు హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

చంద్రబాబుతోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి నాయకులు అన్నారు. గురువారం మండలంలోని కొండమాచుపల్లెలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ బిసి అధ్యక్షులు ఎం.వి.రమణ, తెలుగు యువత అధ్యక్షులు బి.వి.రమణ, నాయకులు ఎం.పి.కృష్ణమూర్తి, ఆలూరు వెంకటసుబ్బయ్య, శ్రీహరి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్టంలో పరిస్థితులను సరిదిద్ది, అన్ని వర్గాలకూ సమన్యాయం చేయాలంటే చంద్రబాబు నాయుడు నాయకత్వం ద్వారానే సాధ్యపడుతుందన్నారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మహిళలు, రైతులు ఇలా ప్రతీ ఒక్కరూ బిడ్డల భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అనసూయమ్మ, రామచంద్రయ్య, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిరాయుడు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీ, మండల ఉపాధ్యక్షుడు జి.మౌలాలి, కిరణ్ కుమార్, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు వీరాంజనేయరెడ్డి, నామాల వెంకటసుబ్బయ్య, గోసంగి ఐవారయ్య, గోపాల్‌రెడ్డి, నరేష్, బి.లక్ష్మీ నరసయ్య, చిన్నరాజా, సుబ్బారావు, మహేంద్ర, సోమ రమణ, పిట్ట చంద్రశేఖర్, జానపాటి సుబ్బరాయుడు, సోమ సుబ్బయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

12న ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న మాదన విజయకుమార్

కడప అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, విద్యారంగ పరిరక్షణ కోసం, పాత పెన్షన్ పునరుద్ధరణ, చట్టబద్ధమైన 12వ పిఆర్సీ ఏర్పాటు, పెండింగ్ బకాయిల సాధన, జీవో 117 రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆగస్టు 12న కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం యుటిఎఫ్ భవన్లో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకొని విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. జీవో 117ను ప్రవేశపెట్టి విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా మార్చివేశారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించామనే కారణంగా ఉపాధ్యాయులను పనిగట్టుకొని వేధిస్తున్నారన్నారు. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠ శాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులపై వేధింపులకు పాల్పడు తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులను వేధిస్తున్న ప్రవీణ్ ప్రకాష్ ను నిలువరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యా యులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వస్తే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెడతామని ప్రకటిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చుతున్నారన్నారు. సమావేశంలో ఫ్యాప్టో ట్రెజరర్ వై.వెంకట సుబ్బయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ (1938), జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.వెంకటేశ్వర్ రెడ్డి, వి.వి.వీరాంజులరెడ్డి, ఏపీటీఎఫ్ (257) జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి, బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఆర్.హరి కొండయ్య పాల్గొన్నారు. **పోరుమామిళ్ల:** కలెక్టరేట్ నిరసనను జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు పి.రమణారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఎంఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీ ఇచ్చిన మేరకు సిపిఎస్‌ను రద్దు చేయకుండా, ప్రత్యామ్నాయంగా జిపియస్‌ను అమలు చేస్తామని చెప్పడం ఉపాధ్యాయ, ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలరాజు, వాకా చంద్రశేఖర్, చెన్నయ్య, విజయభాస్కర్, కుళ్లాయప్ప, పుల్లయ్య, రాంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎఎస్ఐ సుబ్బన్న

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడి తన మానవత్వాన్ని చాటు కున్నారు ట్రాఫిక్ ఎఎస్ఐ సుబ్బన్న. స్థానిక గాంధీ రోడ్డులో గురువారం ఒక వృద్ధుడు సైకిల్‌పై వెళుతుండగా ఫిట్స్ వచ్చి వర్షపు నీటిలో పడిపోయాడు. మార్నింగ్ వాక్‌లో ఉన్న ట్రాఫిక్ ఎఎస్ఐ సుబ్బన్న వెళ్లి చూడగా, కరెంట్ వైర్ తెగి ఉండడాన్ని గమనించి కర్రతో దాన్ని పక్కకు తొలగించారు. అనంతరం వృద్ధునికి సపర్యలు చేసి వారి బంధువులను పిలిపించి అప్పజెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన సుబ్బన్నను ఎస్‌పి అన్బురాజన్ అభినందించారు.

కరెంట్ వైరు తొలగిస్తున్న సుబ్బన్న

రెండు రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల వ్యాప్తంగా రెండు రోజులుగా రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి 9.30 నుండి 11.30 వరకు, బుధవారం రాత్రి 7.30 నుండి 11.30 వరకు 5 గంటలపాటు విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎర్రగుంట్ల మెయిన్ లైన్‌లో అంతరాయం వల్ల విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా అర్థంతరంగా రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంధకారంలో దోమల బెడదతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. పగటి పూట విద్యుత్ కోత విధించినా ఇలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించి రాత్రి వేళల్లో కరెంట్ సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పుల్లేకుండా ఓటు నమోదు చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అర్హతగల ప్రతి ఓటు నమోదు చేయాలని పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశులు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పు లేకుండా జాగ్రత్తగా చేయాలని సూచించారు. జాబితాను డోర్ నెంబర్లు ఆధారంగా ఓటర్లను గుర్తించాలన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్ బాషా, డిటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

టిడిపి, వైసిపి నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ సర్పంచు పదవికి వైసిపి, టిడిపి తరుపున నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి సోమశేఖర్ తెలిపారు. స్థానిక సంస్థలకు చెందిన ఉప ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇడుపులపాయ సర్పంచు పదవికి మాత్రం వైసిపి తరుపున జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి సమక్షంలో మారుతి నగర్‌కు చెందిన తుమ్ములూరు నాగమ్మ, టిడిపి తరుపున మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జయచంద్రారెడ్డి, నిమ్మకాయల దర్బార్, పోతిరెడ్డి శివ సమక్షంలో పెద్దింటి లక్ష్మణ నామినేషన్ వేశారు. పోటీల్లో ఉన్న వాటికి ఈనెల 19న ఎన్నికల జరుగనున్నాయి. నామినేషన్ల వేసే కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఏడు నామినేషన్లు..

ముద్దనూరు : ఈనెల 19న జరగనున్న సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి గురువారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు ఈఓపిఆర్డీ వీరభద్రుడు తెలిపారు. కొలవలి పంచాయతీ సర్పంచుకు 4, కొత్తపల్లి 6వ వార్డుకు 1, యామవరం 6వ వార్డుకు 2 నామినేషన్లు దాఖలైనటు తెలిపారు.

సైనికుల సేవలను స్మరించుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ సైనిక వీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజినేయులు చెప్పారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ భద్రత, క్షేమం కోసం విశేష సేవలు అందించిన మాజీ సైనికులు కెప్టెన్ జోసఫ్ మనోహర్, వీర భైరవరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్స్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ,అధ్యాపకులు పాల్గొన్నారు.

నిడుజువ్వి పాఠశాలలో ..

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి పాఠశాలలో గురువారం నిర్వహించిన ఆజాదీక అమృత్ మహో త్సవ్ వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులు మొక్కలు నాటారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అమర వీరుల జ్ఞాపకార్థం వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునిచ్చాయి. కార్యక్రమంలో జెడ్పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, మండల ప్రత్యేక అధికారి బ్రహ్మయ్య, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీఓ నాగ సులోచన, సర్పంచు అనురాధ, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, అధికారులు

సురేంద్రనాథ్‌రెడ్డి నియామకం రాజ్యాంగ ఉల్లంఘన

ప్రొద్దుటూరు : యోగివేమన విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి బామ్మర్ది ఇసి సురేంద్రనాథ్‌రెడ్డిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడం అక్రమం, యుజిసి నిబంధనలకు, రాజ్యాంగానికి విరుద్ధమని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఉపకులపతి చింతా సుధాకర్, పాలకమండలి సభ్యులు అక్రమ నియామకానికి ఒడిగట్టడం రాజ్యాంగ ఉల్లంఘనని తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగులు పిహెచ్‌డి పూర్తి చేసి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తుంటే ఇలా అక్రమంగా ముఖ్యమంత్రి బామ్మర్ది కాబట్టి ఇలా నియమించడం సబబు కాదన్నారు. ఇసి సురేంద్రనాథ్‌రెడ్డిని తొలగించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని డేవిడ్‌రాజ్ అన్నారు.


టిడిపిలో చేరిన నాయకులు

టిడిపిలో 12 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఆరవేటిపల్లి గ్రామంలో గురువారం జమ్మల మడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి సమక్షంలో మాధవనాయుడు, రాజా నాయుడు, రంగారెడ్డి ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారికి భూపేష్‌రెడ్డి, శివనాథ్‌రెడ్డి టిడిపి కండువా కప్పి ఆహ్వానించారు. కత్తెం పెద్ద గంగన్న కుటుంబం, కూనపులి గంగనాయుడు కుటుంబం, ముట్టి వెంకటేష్ యాదవ్ బ్రదర్స్‌కు చెందిన 12 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, పట్టణ ఇన్‌ఛార్జి రంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు

కులమతాలకతీతంగా వడ్డీలేని రుణాలిస్తున్న ఖిద్మత్ సొసైటీ

ప్రొద్దుటూరులోని ఖిద్మత్ కార్యాలయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చిన్న చిల్లర కొట్టుపెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుందామని ఓ పేదింటి యజమాని రూ.10వేలు అప్పు తెచ్చుకుంటే వడ్డీ వ్యాపారి రూ.1,500 పట్టుకొని రూ.8500 చేతుల్లో పెడ్తాడు. అడిగిన (తీసుకున్న) రూ.10వేలు ఆ వడ్డీ వ్యాపారికి 100 పని దినాల్లో చెల్లించాలి. ఇరుకు ఇబ్బందిలెదురై సరిగా అప్పు చెల్లించకపోతే వడ్డీలకు వడ్డీలు పెంచి ఆ వ్యాపారి ఆర్థికంగా ఎదుగుతున్నాడు. చిరువ్యాపారి బక్కచిక్కిపోతున్నాడు. ప్రొద్దుటూరులో వడ్డీవ్యాపారుస్తుల ఆగడాలపై పత్రికల్లో పలు కథనాలు వెలు వడ్డాయి. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో పేదల జీవితాల్లో వెలుగునింపుతోంది 'ఖిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్. వడ్డీలేకుండా కేవలం తీసుకున్న అసలు మాత్రమే చెల్లించాలనే నిబంధనతో కులమతాలకతీతంగా చిన్నచిన్న వ్యాపారస్తులకు ఆర్థికంగా అండనిస్తోంది. గత జనవరి24న ప్రారంభించిన ఈ సహకార సొసైటీ నేటి వరకు 99 మందికి రూ.41,11,949 రుణాలిచ్చిందని సొసైటీ మేనేజర్ ఇంతియాజుద్దీన్ తెలిపారు. ఎలెక్ట్రీషియన్లు, ఇడ్లీవడ అమ్ముకునేవారు, ఆటో కార్మికులు, సేకిల్‌షాపు యజమానులు, పంక్చర్ వేసేవాళ్లు, టైలరింగ్ చేసేవాళ్లు, స్వర్ణకార్మికులు ఇలా చిన్నచిన్న వ్యాపారస్తులు కనిష్ఠంగా రూ.5వేలు నుండి గరిష్ఠంగా రూ.50వేల వరకు రుణం తీసుకొని ఫీల్డ్ క్యాషియర్ల ద్వారాప్రతిరోజు చెల్లింపులు చేస్తున్నారన్నారు. రూ.1లక్ష వరకు రోజువారీ ఆర్థికలావాదేవీలు జరుగుతున్నాయన్నారు. జిల్లా మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు హుశేన్‌అహ్మద్ మాట్లాడుతూ ఇస్లాం నిబంధనల మేరకు వడ్డీ ఇవ్వడం, పుచ్చుకోవడం దోషం, నేరంగా భావించి నిరుపేదల జీవితాల్లో ఆశా కిరణం కావాలనే ఉద్దేశంతో సొసైటీని జిల్లాలో మొదటిసారిగా స్థాపిం చామన్నారు. ఇలాంటి సొసైటీలు రాష్ట్రవ్యాప్తంగా 8 ఉన్నాయని తెలిపారు. వీటిలో నంద్యాలలోని సొసైటీ రోజువారీగా రూ.కోట ఆర్థిక లావా దేవీలతో ముందుందన్నారు. ఆంధ్రరాష్ట్రంలో' ఖిద్మత్' పేరుతో, కర్నాటకలో 'కారుణ్య' పేరుతో, తెలంగాణాలో 'సేవ' పేరుతో ఈ సొసైటీ సేవలం దిస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రధాన కార్యాలయ పర్యవేక్షణలో ఈ మూడు రాష్ట్రాలలోని సొసైటీలు పనిచేస్తున్నాయన్నారు. ప్రొద్దుటూరు బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు షేక్ సలీం మాట్లాడుతూ పేదప్రజలను జలగల్లా పీడిస్తున్న కార్పొరేషన్ వడ్డీల బారినుండి తప్పించేందుకు ఈ సొసైటీని స్థాపించామన్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము ఫైనాన్స్‌లకే సరిపోతోందనే చిరువ్యాపారస్తుల ఆవేదనలోంచి పుట్టిందే ఈ ఖిద్మత్ సొసైటీ అన్నారు.

జీవితం హాయిగా గడుస్తోంది

ద్విచక్రవాహనాలు పెరిగిన ఈ రోజుల్లో చిన్న సైకిల్‌షాపుతో గడవడం కష్టంగా ఉండేది. సొసైటీలో రూ.50వేలు రుణం తీసుకొని గాలి మిషన్, మోటర్ సైకిళ్ల విడిభాగాలు తెచ్చుకొని రోజువారీ చెల్లింపులతో జీవితం హాయిగా గడుస్తోంది.

– హెచ్.చాంద్‌బాషా, సైకిల్ షాపు

రెండు సార్లు రుణం తీసుకున్నాను

రూ.50వేలు ప్రకారం రెండు సార్లు రుణం తీసుకున్నాను. తద్వారా బాడుగ ఆటో సొంతమైంది.దిగుల్లేకుండా జీవిసున్నాను. ఆర్థిక భారంలేకుండా కుటుంబాన్ని గడుపుతున్నాను.

- షేక్ కమాల్‌బాషా, ఆటో కార్మికుడు

రూ.20 వేలు రుణం తీసుకున్నా..

రూ.20వేలు అప్పు తీసుకున్నాను. ఎలక్ట్రికల్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాను. ప్రతిరోజూ రూ.200 సొసైటీకి అప్పు చెల్లిస్తున్నాను. కష్టమనిపించడంలేదు. రుణం తీరిపోతా ఉంది.

- వి.యస్.చాంద్‌బాషా, ఎలక్ట్రీషియన్

రక్తదానం చేయండి.. ప్రాణాన్ని కాపాడండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రక్తదానం చేయండి.. ప్రాణాన్ని కాపాడండి అని జమ్మలమడుగు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే మరొకరికి జీవితాన్నివ్వడమేనని తెలిపారు. రక్తదాన నిల్వ కేంద్రం డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ఐసిటిసి కౌన్సిలర్ వి.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం ప్రోత్సహించే వారి కోసం మార్గదర్శకాలను వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్ నెల్సన్ మాట్లాడుతూ ప్రతి చోట రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తం అవసరమైన వారు జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రి రక్త నిల్వ కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు. 24 గంటలు రక్తం అందుబాటులో ఉంటుందన్నారు. దాతలు బైరెడ్డి, పలువురు దాతలు తీసుకొచ్చి వారిచే రక్తం ఇప్పించారు. వారిని ప్రోత్సహించి వారిచ్చే రక్తదానం చేయించారు. కార్యక్రమంలో సిస్టరు లీలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

నులిపురుగు నివారణ మందు వేస్తున్న శశిభూషణ్

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిపిఎంఒ శశిభూషణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. వీటిని వాడడం వల్ల నులిపురుగులు నశించి పిల్లల్లో పెరుగుదల కనిపిస్తుందన్నారు. సిబ్బంది ప్రతి ఒక్క విద్యార్థికి నులిపురుగు నివారణ మందులు అందజేయాలని సూచించారు. మండల పరిధిలో 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలు 6,700 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఒ రమేష్‌రెడ్డి, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఓబులేసు, ఉపాధ్యాయులు, సూపర్వైజర్ సరస్వతి, ఎఎన్ఎం స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** నులిపురుగులు అనేక రుగ్మతలకు కారణమని, వాటిని ఒక్క మాత్రతో తరిమేసి ఆరోగ్యంగా జీవించాలని జిల్లా కార్యక్రమాధికారి డాక్టర్ శశిభూషన్‌రెడ్డి తెలిపారు. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని ఖాజీపేట-2 సచివాలయం పరిధిలోని ఆర్ఇఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఆల్బెండాజోల్ మాత్రలను వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటరెడ్డి, కళాశాల అధ్యాపకులు, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, ఆశ నోడల్ అధికారి అరుణకుమారి, సూపర్‌వైజర్స్ శోభన్‌బాబు, కృష్ణప్రియ పాల్గొన్నారు. **వల్లూరు :** మండలంలోని గంగాయపల్లి ఆదర్శ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ నులిపురుగులు ఉండడంతో రక్తహీనత, ఆకలి లేకుండా, వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి, నీరసం, ఆందోళనలు, బరువు తగ్గడం, మల విసర్జన సరిగా ఉండదన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జుబేదా, ఎంఇఒ లిల్లెమ్మ, ఎంఇఒ-2 విజయరెడ్డి, డాక్టర్ ఫణీంద్ర, సిహెచ్ఒ వేణుగోపాల్, సూపర్వైజర్ సుధాకర్, ఏఎన్ఎం మమత, శ్రీదేవి, కవిత పాల్గొన్నారు. **కొండాపురం :** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 33 అంగన్వాడీ సెంటర్లు, 23 ప్రాథమిక పాఠశాలు, రెండు అప్పర్ ప్రైమరీ స్కూల్స్, అయిదు జిల్లా పరిషత్ పాఠశాలలు, 4 ప్రయివేట్ విద్యాసంస్థలు, రెండు జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. 4,464 మంది పిల్లలకు గానూ 4,388మందికి మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు మింగించామని డాక్టర్ వి.సుజాత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వి సుజాత చౌటుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న అంగన్వాడీ సెంటర్, ప్రైమరీ స్కూలు సందర్శించి వారికి 'ఆరోగ్య విద్యను' అందించారు. చేతుల శుభ్రత గురించి వివరించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు బాల నరసింహులు, ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, సిహెచ్ఓ కళ్యాణి, ఆరోగ్యకార్యకర్త అరుణకుమారి, ఆశా కార్యకర్తలు రమాదేవి, ప్రేమవినీల, అంగన్వాడీ టీచర్లు వి.విజయకుమారి, డి.తారాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని ఇస్లాంపురం పాఠశాలలోని విద్యార్థులకు జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మునిసిపల్ వైస్ ఛైర్మన్ హఫీజ్, మునిసిపల్ కమిషనర్ వివి నరసింహరెడ్డి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళీధర్, మెడికల్ అధికారి జీవన్‌కుమార్, సచివాలయం అడ్మిన్ దస్తగిరమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** కడుపులో ఉన్న నులి పురుగుల నివారణకు విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి కోరారు. తాళ్ళపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతిసాయి, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, సిహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పద్మజ, ఆశాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, సిబ్బంది గురువారం విద్యార్థులకు మాత్రలను అందజేశారు. ఆరోగ్య అధికారి ప్రసన్నలత అమ్మాయిల మెన్సెస్, రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ ట్రైనింగ్ డాక్టర్ గుల్జార్ బేగం, సర్వేశ్వర్, శిక్షణ డాక్టర్ పవన్‌కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అందుబాటులో ఎరువులు : ఎఒ

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బికెల్లో సిబ్బంది సిద్ధంగా ఉంచుతున్నారు. ప్రస్తుతం అన్ని ఆర్‌బికెల్లో యూరియాను అందుబాటులో ఉంచారు. ప్రతి ఆర్‌బికెలో అయిదు మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంచామని ఎఒ మ్యాగీ తెలిపారు. ప్రస్తుతం రైతులు వరి నార్లు, పసుపు సాగు చేస్తున్నారు. అయ్యవారిపల్లి, తిమ్మాయిపల్లి, రాజువారిపేట, సీతారామపురం, చాపాడు, ఖాదర్‌పల్లి గ్రామాల పరిధిలో వరి నారు పోస్తున్నారు. సీతారామాపురం, శ్రీరాములపేట, కుచ్చుపాప గ్రామాల పరిధిలో పసుపు సాగు చేశారు. రైతులకు ప్రస్తుతం అధికంగా యూరియా అవసరం ఉండడంతో రైతులకు అందుబాటులో ఉంచారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డుతో ఆర్‌బికెల్లో సంప్రదించాలని ఎఒ సూచించారు.

ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఎఒ మ్యాగీ

రాయితీతో డ్రోన్లు పంపిణీ..

వ్యవసాయంలో పెరుగుతున్న ఆధునీకరణలో భాగంగా వచ్చిన డ్రోన్‌లను రైతులకు రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. డ్రోన్‌ల ద్వారా క్రిమి సంహారక మందులు పంట పొలాలకు పిచికారి సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌లను రైతు సిహెచ్‌సి గ్రూపులకు ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. ఎజిబిఎస్, డిప్లొమా పూర్తి చేసిన వారికి 50శాతం రాయితీతో మంజూరు చేస్తుందన్నారు. కావలసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రోడ్లు, రైల్వే సమస్యలు పరిష్కరించాలి : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కడప పార్లమెంటు పరిధిలో ఉన్న రోడ్లు, రైల్వే, మొబైల్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా అండ్ హైవే మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర రైల్వేశాఖ, సమాచార మంత్రి అశ్విని వైష్ణవను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ వైయస్ఆర్ కడప జిల్లాలోని దాదాపు 26 మండలాలకు మొబైల్ కనెక్టివిటీ ఇప్పటికీ లేదన్నారు. ఆయా గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ లేదా కవరేజీ సరిగా లేకపోవడం వల్ల గ్రామస్తులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోలేకపోతున్నారని వివరించారు. కొత్త 4జిటవ ర్‌ల ను మంజూరు చేస్తూ, మొబైల్ కనెక్టివిటీ సేవలను అందించాలని ఎంపీ కోరారు.

మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ అవినాష్‌రెడ్డి

జిల్లా అభివృద్ధిపై ఢిల్లీలో ఎంపీ గళం : కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా రాయలసీమ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, కడప ఉక్కుపై పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత, భావితరాల అభివృద్ధికి, పారిశ్రామిక పురోగతి, విద్యా రంగం, రోడ్ రవాణా, రైల్వే, రైతుల బీమా, కడప ఎయిర్ పోర్టు అభివృద్ధిపై తనదైన శైలిలో అన్ని శాఖల కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరిపారన్నారు. మన ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధితో పని చేస్తూ జగన్ అన్నకి తగ్గ తమ్ముడుగా పేరు గాంచిన ప్రజా నాయకుడు అవినాష్‌రెడ్డి అని ప్రశంసించారు. ఈ ప్రాంత అభివృద్ధిలో తన ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు జిల్లాలో ఎవ్వరైనా ఉన్నారంటే అది కేవలం వైఎస్ అవినాష్‌రెడ్డి మాత్రమే అని అన్నారు.

ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

పులివెందుల టౌన్ : ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర ఎన్‌జిఒ మహాసభలను విజయవంతం చేయాలని పులివెందుల తాలూకా ఎన్‌జిఒ సంఘ అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, కార్యదర్శి కష్టారెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు గురువారం స్థానిక రింగ్‌రోడ్డు సమీపంలో పులివెందుల బ్రాంచి కెనాల్ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ప్రభుకుమార్, శంకరయ్య, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసు అప్రజాస్వామికం : రెడ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

తంబళ్ళపల్లె నియోజకవర్గం అంగళ్లలో వైసిపి శ్రేణులు టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును చంపేందుకు ప్రయత్నించి, మళ్లీ ఆయనపైనే హత్యాయత్నం, కుట్ర కేసు పెట్టడం అప్రజాస్వామికమని టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. దుంపలగట్టులోని కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే 'ఉక్కు' సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం రావా లంటే అటు కేంద్రం లోనూ ఇటు రాష్ట్రంలోనూ కాం గ్రెస్ పార్టీ అధికా రంలోకి రావాలని పిసిసి మీడియా ఛైర్మన్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం శర్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా తులసిరెడ్డి మాట్లాడుతూ సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగార నిర్మాణానికి కావలసిన అన్ని వనరులున్నాయన్నారు. సమా వేశంలో సమన్వయ కమిటీ సభ్యులు పూల నజీర్, సైమన్, జిలానీబాషా పాల్గొన్నారు

మాట్లాడుతున్న తులసిరెడ్డి

CHANGE OF NAME

I Palagiri Vandana alias Palagiri Naga Vandana W/o Palagiri Rami Reddy, D.No: 2-10, Valluru (V& M), Y.S.R. Kadapa Dist., A.P., hereby declare that I have changed my name from M.Naga Vandana to **PALAGIRI VANDANA (New Name).**

రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో, గుత్తి
H.M.O.P.NO:108/2021

Between:
జింక మాధవి ...పిటీషనర్
మరియు
అవ్వార్ లక్ష్మయ్య ...రెస్పాండెంట్
S/o A.రామదాసు, R/.D.No:26/2820, 26th Wad, బంగారయ్య కొట్టాలు, వసంతపేట, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

రెస్పాండెంటు హాజరు నిమిత్తం నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై దావాలో పిటీషనర్ రెస్పాండెంట్ అయిన నీ నుండి విడాకులు కోరుతూ పై దావా వేసి యున్నది. సదరు దావా రెస్పాండెంటు అయిన నీ హాజరు నిమిత్తం 05/09/2023వ తేదికి వాయిదా వేసినారు. పైన తెలిపిన తేదీన నీవు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టు ఎదుట హాజరై అభ్యంతరమలు ఉన్న యెడల తెలుపుకోవలెను.లేని యెడల నీ పరోక్షం నందు తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలుపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
అప్పా క్రిష్ణయ్య, ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
టి.ధనుంజయ, బి.ఎ., బి.ఎల్.,
పిటీషనర్ న్యాయవాదులు, తాడిపత్రి మరియు గుత్తి.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ : రాజంపేట
I.P. NO. 8 /2009

సింగిరి గంగాధర తండ్రి సుబ్బరామయ్య, బాలా నగర్, రైల్వే కోడూరు టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా ...Petitiioner

వర్సెస్

37. తులసిరెడ్డి, ప్రొప్రైటర్ లక్ష్మి థియేటర్, పులివెందుల, కడప జిల్లా.
45. రామచంద్రారెడ్డి, ప్రొప్రైటర్, సుజాత థియేటర్ పులివెందుల, కడప జిల్లా.
...Respondents 37&45

పైన తెలిపిన పిటిషనరు తనను ఇన్సాల్వెంట్‌గా తీర్మానించమని పై కోర్టులో పై కేసులో రెస్పాండెంట్ అయిన మీపై పైన తెలిపిన ఐ.పి దాఖలు చేసి ఉన్నాడు. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టులో 18-09-2023 తేదీన ఉదయం 10:30 నిమిషములకు స్వయంగా గాని లాయర్ ద్వారా గాని హాజరై మనవి చేసుకోవలెను లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//
జి.సురేంద్ర,
అడ్వకేట్, రాజంపేట.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA
I.A.No. 75/2022
IN
O.S.No. 534/2022

Meruva Lakshmi Devi, W/o Ramachadrudu, aged about 42 years, Hindu, Housewife, resident of D.No.4/35, M.R.D.Street, Chennur Mandal, Kadapa District. Proprietor of Sri Sumangali Textiles, D.No.1/441-14, Patel Raod, RTC Bus Stand to Railway Station Road, Kadapa City. Ph.No.9441637749.
...Petitioner/Plaintiff
Vs
Vutti Ram Chandra, S/o Late Murali, aged about 35 years, Hindu, Business, Resident of D.No.39/383-59, Om Shanthi Raod No.6, Vivekananda Nagar, Kadapa City and District. Whats App No.+41787369055, 9652296018.
...Respondent/Defendant

NOTICE TO RESPONDENT

పై దావాలోని పిటీషన్ షెడ్యూల్ దాఖలా ఆస్థి విషయమై మీ పైన Temporory Injuction కోరుచూ పిటీషనర్ పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 12.09.2023న ఉన్నది. కావున మీరు 12.09.2023న ఉదయం 10.30గం॥లకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//
P. RAJENDRA PRASAD
Advocate For Petitioner

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA
O.S.No. 534/2022

Meruva Lakshmi Devi, W/o Ramachadrudu, aged about 42 years, Hindu, Housewife, resident of D.No.4/35, M.R.D.Street, Chennur Mandal, Kadapa District. Proprietor of Sri Sumangali Textiles, D.No.1/441-14, Patel Raod, RTC Bus Stand to Railway Station Road, Kadapa City. Ph.No.9441637749.
...Plaintiff
Vs
Vutti Ram Chandra, S/o Late Murali, aged about 35 years, Hindu, Business, Resident of D.No.39/383-59, Om Shanthi Raod No.6, Vivekananda Nagar, Kadapa City and District. Whats App No.+41787369055, 9652296018.
...Defendant

SUMMONS TO DEFENDANT

పై దావాలోని వాది పై దావా షెడ్యూల్ దాఖలా ఆస్థి విషయమై మీ పైన Permanent Injuction కోరుచూ పై దావాలోని వాది మీ పైన పై కోర్టులో పై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తమై 12.09.2023న ఉన్నది. కావున మీరు 12.09.2023న ఉదయం 10.30గం॥లకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//
P. RAJENDRA PRASAD
Advocate For Plaintiff